# కాటు

సన్నని కాలి బాట. బాటకి అటు ఇటు ఏవో పిచ్చిమొక్కల పొదలు.

ఎదురుగా వస్తున్న కాంతయ్యను చూసి పక్కకి తప్పుకోడానికి ప్రయత్నించింది చంద్రావతి. అరికాళ్ళనిండా దెయ్యం ముళ్ళు గుచ్చుకొన్నాయి. నెత్తిమీదున్న మంచినీటి కడవ కిందికి దించి కాళ్ళకి పట్టిన ముళ్ళు దులపసాగింది.

అతడు దగ్గరికి వచ్చేశాడు. ఆగాడు అతిసమీపంగా.

నవ్వాడు.

ముఖంలో ఏదో మాట్లాడాలన్న ప్రయత్నం కనిపించింది గాని మాట్లాడలేదు.

చంద్రావతీ!

పెళ్ళికెదిగిన కూతురున్నా, నలుగురు బిడ్డల తల్లి అయినా, ఒక్కపూట పట్టెడన్నం దొరకడమే కష్టమైన దారిద్ర్యంలో బతుకీడుస్తున్నా సానపెట్టబడిన బంగారంలా మెరిసిపోతూనే వుంది చంద్రావతి.

ఆమె పెళ్ళయ్యి అత్తవారింటికి వచ్చినప్పటినుండి ఆమెకోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. చేతికి చిక్కడం లేదు. నిప్పయి, మంటయి అంతదూరం నిలబెడుతూ వస్తూంది.

తన ప్రయత్నాలు సాగుతుండగానే నలుగురు బిడ్డలకు తల్లి అయింది. ఏడాది క్రితం మగడు చచ్చి విధవ కూడా అయింది. అయితే ఏం? ఆమె అందం చెదరనట్టే ఆమె పొగరు కూడా తగ్గలేదు.

ముళ్ళు దులుపుకొని అతడిని దాటి గబగబా నడవసాగింది చంద్రావతి, కడవ తలమీదికెత్తుకొని.

తనదంతా పైన పటాటోపం! తీక్షణంగా కళ్ళెర్రజేసి చూస్తుందేగాని ఎప్పుడూ ఈ కాంతయ్యే అంటే దడగానే ఉంటుంది. పెళ్ళయి అత్తవారింట అడుగుపెట్టినప్పటి నుండి కాంతయ్య చూపులు కామంతో తనను వెన్నాడుతూనే ఉన్నాయి. రెండుమూడు సార్లు వాళ్ళ పనిమనిషితో కబురు చేశాడు కూడా. గౌరిని కొట్టినంతపని చేసిందేగాని ఎవరితోనూ చెప్పుకోలేదు. చివరికి భర్తతో కూడా చెప్పలేదు. ఇలాంటివి గుట్టుగా అణిగిపోతేనే బాగుంటాయిగాని రభసచేస్తే ఎంత అసహ్యంగా ఉంటాయి.

గతాన్ని నెమరువేస్తూ ఊళ్ళో ప్రవేశించింది.

మరో పది అడుగులు వేస్తే చంద్రావతి ఇల్లు వస్తుంది.

కాని, ఆమెకి కనిపించిన దృశ్యం!

నిలువెల్లా వణికిపోయేలా, వణుకు తగ్గాక మండిపోయేలా చేసింది.

తన ప్రథమ సంతానం పుష్ప జాఫర్‌తో మాట్లాడుతోంది!

జాఫర్ ఇరవయ్యేళ్ళ పడుచువాడు. ఊరంతటికీ అందగాడు. అతగాడి తండ్రి చెప్పుకోతగ్గ ధనవంతుడు ఆ ఊళ్ళో.

జాఫర్‌తో తన కూతురికి చిన్నప్పుడు బళ్ళో చదువుకొన్న చనువుంటే ఉండొచ్చు. వయసొచ్చాక దాన్నిలా బజారుపాలు చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? అసలు, ఈ అమ్మ పెళ్ళి చేయలేదని తన బతుకునే బజారుపాలు చేసుకోదల్చుకొందా?

చంద్రావతి ఎలాగో ఇల్లు చేరుకొంది.

అడుగులో అడుగువేస్తూ ఇంట్లో ప్రవేశించిన పుష్ప ఎదుట ఉగ్రమూర్తిలా నిలబడింది.

"ఎక్కడ ఉన్నావిందాక?"

"నాగమ్మత్త ఇంట్లో."

పుష్ప చెంప ఛెళ్ళుమంది. "నిజం చెప్పు."

ఏడవసాగింది పుష్ప. బెదురు చూపులు చూస్తూ.

"ఆ జాఫర్‌తో ఎందుకు మాట్లాడుతున్నావు? ఊరికే మాటలు కాదు. ఒళ్ళంతా ఒయ్యారాలు పోతూ మాట్లాడుతున్నావు వాడితో. వాడితో నిఖా కట్టించుకొంటావా? లేచి పోతావా?"

పుష్ప బావురుమంది.

"ఏడుస్తావెందుకే, నిజం చెప్పమంటే? ఈ అమ్మ ఎలాగూ పెళ్ళి చేయలేదని నీ దారి నువ్వు చూసుకోవాలనుకొన్నావా? ఇలా వంశ మర్యాద, కన్నవారి పేరు మంటగలిపి ఆ బతుకు బతక్కపోతే ఏమే? చచ్చిపో."

"ఇంకెప్పుడూ జాఫర్‌తో మాట్లాడనమ్మా."

"ఒట్టెయ్యి! బతికితే నిప్పులా, చావాల్సివస్తే పవిత్రంగా చస్తానని ఒట్టెయ్యవే!" కాళీ అవతారంలా ఉన్న తల్లి ముఖంలోకి బెదురుగా చూస్తూ వణికే చేతిని తల్లి చేతిలో ఉంచింది పుష్ప. "ఒట్టు నీ మీద. అంతగా మనసునరికట్టుకోలేని పరిస్థితే వస్తే ఈ శరీరాన్ని శవంగా నువ్వు చూడగలవని నీమీద ఒట్టేస్తూ చెబుతున్నానమ్మా."

చంద్రావతి కొంచెం శాంతపడింది. బయట గోలీలు ఆడుతోన్న కొడుకుని చూసి, "ఏరా, గోపీ? బడి లేదూ?" అని అడిగింది.

"బడి ఎందుకు లేదు? కడుపులో ఆకలి చిచ్చు పెట్టుకొని బడికి వెళ్ళి ఏం చదువుకు వస్తానమ్మా?"

కొడుకు సమాధానం కొరడా దెబ్బలా తగిలింది చంద్రావతికి. నిన్న మధ్యాహ్నం తిన్న నాలుగు మెతుకులు. తనకే కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. పిల్లల్ని ఏమంటుంది?

రెండో కొడుకు వేణు బయటి నుండి పరిగెత్తుకు వచ్చాడు, పరిగెత్తడం వల్ల వగరుస్తూ వాడి చెయ్యి నిక్కరు జేబుమీద ఉంది! జేబు నిండు చూలాలులా ఉంది.

"ఏమిటిరా అవి?"

"పల్లీలు."

"ఎక్కడివి?"

"నాగమ్మత్త పెట్టింది."

"నేను పెట్టానా? బస్తాకిరంధ్రం పెట్టి జేబు పట్టినన్ని నువ్వు ఎత్తుకు వచ్చావా?" నాగమ్మ గొంతు వాకిట్లో వినిపించింది.

మూలనున్న కర్ర చంద్రావతి చేతిలోకి రావడం, వేణువంటి మీద దెబ్బలు వర్షంలా పడడం క్షణంలో జరిగిపోయాయి. జేబులో పల్లీలు ఒలికిపోయి ఇంటినిండా దొర్లిపోయాయి.

ఆ కోపం, ఆ దెబ్బలు చూడలేక నాగమ్మే అడ్డుకొంది చివరికి. "నువ్వు తల్లివా, రాక్షసివా? ఏదో పిల్లాడు తెలీక తుంటరిపని చేస్తే కంటానోటా భయపెట్టుకోవాలి గాని ఇలా చావగొట్టుకొంటారా ఎవరైనా?" చంద్రావతి చేతిలోంచి కర్ర లాగి పారేసింది.

వేణు ఏడుస్తూ. "రాత్రి నుండి అన్నం లేదు. ఆకలేస్తూంది. అడిగితే నాగమ్మత్త పెట్టదని... " అని అవతలికి వెళ్ళిపోయి శోషవచ్చినట్టుగా అరుగుమీద పడ్డాడు.

✧ ✧ ✧

అర్ధరాత్రి దాటినా చంద్రావతి కంటిమీదికి కునుకు రాలేదు.

భవిష్యత్తులోకి చూచుకొంటే అంతా గాఢాంధకారంగా కనిపించ సాగిందామెకు!

కాలు జారడానికి తయారుగా ఉన్న కూతురు. చదువబ్బని పెద్ద కొడుకు. దొంగతనాలకి అలవాటుడు పడుతున్న రెండో కొడుకు. తెల్లారేసరికి ఆకలాకలంటూ కాళ్ళకు చుట్టుకుపోయే ఆఖరి వాడు. వీళ్ళనీ స్థితిలోకి ఈడుస్తున్న దరిద్రభూతం! ఈ భూతాన్ని తరమడానికి తనకి ఏ దారీ కనిపించడం లేదు.

ఎలా? ఎలా? గట్టెక్కాలి?

కొద్ది రోజులు గడిస్తే బాగా చదివే గోపి బడుద్దాయిగా మారుతాడు. వేణు దొంగపిల్లాడుగా ముద్రపడతాడు. ఆఖరివాడు ఆకలివాత పడతాడు.

ఇవన్నీ చూస్తూ తను బతకగలదా?

పరిస్థితి మరింత దిగజారకముందే తనీ లోకంనుండి తప్పుకొంటే? తన సంతానాన్ని ఆ స్థితిలో వదిలేసి తను ఆత్మహత్య చేసుకోవడం ఎంతవరకు సమంజసం?

తను చచ్చినా ఫలానా చంద్రావతి పిల్లలు అనడం మానేస్తారా జనం?

ఈ అప్రతిష్టనుండి తప్పుకోవాలంటే హత్య, ఆత్మహత్య తప్ప మరి మార్గం లేదు. జన్మనిచ్చిన దానికి వాళ్ళ ప్రాణం తీసుకొనే హక్కు తనకి లేదూ? ఉంది. ఆ హక్కు తనకి తప్పకుండా ఉండాలి.

చంద్రావతి ఒక నిశ్చయానికి వచ్చేసింది.

✧ ✧ ✧

"నాగమ్మ వదినా!"

"ఎవరూ? చంద్రావతేనా?" వంటింట్లోంచి పలికింది నాగమ్మ.

"శేరు గింజలు-ఏవైనా సరే పెట్టు వదినా! ఇదే ఆఖరు. నిన్నెప్పుడూ అడిగి వేధించను."

"ఎప్పుడడిగినా ఇలాగే అడుగుతావుగా?" నాగమ్మ ముఖం మాడ్చుకొంది.

"ఉహూం. ఇంకెప్పుడూ అడగను. ఆయన పోయాక... అడపా దడపా నువ్వే మమ్మల్ని తోడబుట్టిన దానిలా ఆదుకొంటున్నావు. నువ్వు నా స్నేహితురాలివే కాదు, ఆకలికి ఎన్నోసార్లు అన్నం పెట్టిన దేవతవి!"

నాగమ్మ ముఖం ప్రసన్నమైంది. "ఎవరిదైనా సంసారమే కదే! నువ్వు మాటి మాటికీ చేటపట్టుకు వస్తే ఎలా? మీ అన్న చూస్తే నన్ను చంపుతాడు" అంటూనే ధాన్యపు గదిలోంచి బియ్యం తీసుకువచ్చి చంద్రావతి చేటలో పోసింది.

నాగమ్మ చంద్రావతికి ఎంత స్నేహితురాలైనా బియ్యం పెట్టడం అరుదు. ఏ జల్లెడకింద నూకలో, ముక్క కంపుకొట్టే పరమో పెడుతుంది. సంసారం గట్టిచేసుకోవడంలో దిట్ట అయిన నాగమ్మ ఈ వేళ ఏ కళనుందో డబుల్ పాలిష్ చేసిన బియ్యం పెట్టింది.

"త్వరగా వెళ్ళిపో. ఆయన వస్తారు" అని చెప్పి వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది.

వ్యవసాయపు పనిముట్లు పడవేసే గదిలో అటకమీద ఎండ్రిన్ డబ్బాలు ఎప్పుడూ ఉంటాయి. ఆ సంగతి చంద్రావతికి తెలుసు. గబగబా ఆ గదిలోకి వెళ్ళి నిండుగా ఉన్న ఎండ్రిన్ డబ్బా చీర కుచ్చిళ్ళ చాటున పెట్టుకొని బయటపడింది. చంద్రావతి జీవితంలో మొదటిసారిగా చేసిన దొంగతనమిది!

తల్లి చేటలో బియ్యం తీసుకురావటం చూశారు పిల్లలు. వాళ్ళ కళ్ళు ఆనందంతో మిలమిలలాడాయి. "త్వరగా వండమ్మా. ఆకలితో ప్రాణం పోతోంది."

"వండుతాను గాని కమలమ్మ నడిగి కాస్త ఆవపెట్టించుకురా!" అని చెప్పింది పుష్పతో.

"జాడీ మొన్ననే కాళీ అయిందని చెప్పిందమ్మా."

"అలాగే చెబుతుందిగాని, ఈ ఒక్కసారికి పెట్టమను. ఇంకెప్పుడూ అడగమని చెప్పు!"

"ప్రతీసారీ ఇదేముక్క చెబుతావు నాకు."

✧ ✧ ✧

"ఇక చెప్పనే ఇదే ఆఖరుసారి. బియ్యం పొయ్యిమీద పడేసి కింద మంట పెట్టసాగింది చంద్రావతి. ఆవురావురుమనే ఆకలితో పొయ్యిమీద కుతకుతలాడుతున్న అన్నం కేసి చూస్తున్నారు పిల్లలు.

"అన్నం అయ్యాక పిలిచిపెట్టనా? ఇలా పొయ్యి చుట్టూ కూర్చోవడం ఏమిటి అసహ్యంగా? బయటికి పదండి" పిల్లల్ని బయటికి తరిమేసి కుండల చాటున ఉన్న ఎండ్రిన్ డబ్బా తీయబోయింది.

"ఎప్పుడూ రెండు ముక్కలకంటే ఈ రోజు కమలత్త గిన్నెనిండా పెట్టిందే. గిన్నెతెస్తే మజ్జిగకూడా పోస్తానంది" అంటూ సంతోషంగా ప్రవేశించింది పుష్ప. ఆ గిన్నె అక్కడ పెట్టి మజ్జిగకోసం గిన్నె తీసుకుని వెళ్ళిపోయింది.

కుండలచాటునుండి ఎండ్రిన్ డబ్బా తీసుకొన్న చంద్రావతి చేతులు వణుకుతున్నాయి.

ఆకలినోటికి వేడి వేడి అన్నం, ఆవకాయ ఎంత రుచిగానైనా ఉంటుంది. ఆ రుచిని తలుచుకొని నోట్లో నీరూరించుకొంటున్న పిల్లలు! వాళ్ళకి తను పెడుతున్నదేమిటి? విషం! అమృతం పోసి చిరాయువుగా జీవించమని ఆశీర్వదించాల్సిన తల్లి విషంపెట్టి చంపేస్తోంది.

పుష్ప తనని మొదటిసారిగా తల్లినీ, ఆయన్ని తండ్రినీ చేసిన రోజు గుర్తు వచ్చింది చంద్రావతికి. పిల్ల అందం గురించి ఎంతమురిసిపోయారు? ఎన్ని కలలు కన్నారు. ఆయనకి ఆ పాడు జబ్బు పట్టుకొని ఆయన ఆరోగ్యంతో పాటు ఆస్తినీ హరించింది! చివరికి మనిషి కూడా దక్కకుండా పోయాడు.

'మీరెంతో గర్వపడే పిల్లల్ని ఇవాళ నేనేం చేస్తున్నానో తెలుసా? సరైన తీరుగా పెంచలేక, వాళ్ళ ఆకలి తీర్చలేక చంపేస్తున్నానండీ' పోయిన భర్తను తలుచుకొని కన్నీరు నింపుకొంది.

ఎక్కడో ఓ తల్లి పిల్లలకి విషయం పెట్టి తనూ తిన్నదట. పిల్లలు చచ్చి తను బతికిందట. తన విషయంలోనూ అలాగే జరిగితే... చంద్రావతి శరీరం చెమటతో స్నానం చేసినట్టుగా తడిసిపోయింది.

నోట నురుగులు కక్కుతూ, మెలికలు తిరుగుతూ చివరికి పిల్లలు శవాలుగా మారిన దృశ్యం చంద్రావతి కళ్ళముందు కదిలి, అది నిజమేనన్నంత భయంతో కెవ్వుమంది.

"ఏంటమ్మా?" పిల్లలు పరిగెత్తుకు వచ్చారు.

చంద్రావతి చప్పున తెప్పరిల్లి ఎండ్రిన్ డబ్బా పిల్లకంట పడకుండా కుండల చాటుకి విసిరేసింది. "అన్నం అయ్యింది వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కురండి". అని పిలిచింది.

నిమిషంలో పిల్లలు తిరిగి వచ్చారు. పుష్పకూడా మజ్జిగ తీసుకొని వచ్చింది.

అన్నం గిన్నె దింపి పిల్లలందరికీ వడ్డించింది చంద్రావతి.

"కడుపునిండలేదమ్మా! ఇంకాస్త పెట్టు" గోపీ అన్నాడు వేళ్ళు నాకుతూ.

పుష్ప గిన్నెలోకి చూసి, "పట్టెడే వుందిరా! అమ్మ తినొద్దా?" అంది.

"నా కడుపు నిండిందిలే అమ్మా! నువ్వు తిను" లేచిపోయాడు గోపి.

అన్నం గిన్నె కాళీ అయిందిగాని కుండలచాటున ఎండ్రిన్ డబ్బా ఒక్క చుక్కా ఖర్చుకాకుండా అలాగే ఉండిపోయింది. ఇవాళే కాదు ఇంకెప్పుడూ తన పిల్లలకి విషం పెట్టి చంపుకోలేననిపించింది చంద్రావతికి.

చస్తే తనొక్కతి చావాలి! వాళ్ళ ప్రాణం తీసేహక్కు తల్లి అయినంత మాత్రాన తనకి లేదు.

✧ ✧ ✧

"నువ్వేమో నన్ను కొట్టొస్తావు! ఆయనేమో నన్ను చంపుకు తింటున్నాడు తల్లీ! మీ ఇద్దరి నడుమ నా ప్రాణం పోతుంది.

సంధ్యవేళప్పుడు దిక్కులు జాగ్రత్తగా చూస్తూ మెల్లగా ఇంట్లోకి వచ్చి చంద్రావతితో అంది గౌరి.

ఇదివరలో దానినోటినుండి మాటే రాకుండా మూలనున్న చీపురు తీసుకొనే చంద్రావతి, దానికి భిన్నంగా ఈ రోజు గౌరిని వాగాల్సిందంతా వాగనిచ్చింది.

"ఈనాటిదా నీ మీద మనసు? నీ పెళ్ళయ్యి అత్తింటి కాలుమోపినకాణ్ణించి నీ మీద మా అయ్య మనసు పడ్డది! ఈనాటికీ అది అట్లనే నిలబడ్డది. నువ్వింత

కష్టంలో పడి కొట్టుకొంటుంటే మా అయ్యా మనసు ఎంత కొట్టుకొంటుందో చెప్పలేను. ప్రేమగా ఒక చూపు చూశావా, నీ ఇంట లక్ష్మి ప్రవేశించిందనుకో! ఈ ఉపవాసాలు, చిరిగిన కోకలు నీ ఇంట ఉండవు! నిన్ను దొరసానిని చేస్తడు మా అయ్యా. మీ పిల్లలకి ఒక దారి ఏర్పరుస్తాడు. పరిస్థితి ఇదివరకటిది కాదు! బాగా ఆలోచించుకో!"

గౌరి ముఖంలోకి నిశ్చలంగా చూడసాగింది చంద్రావతి.

ఆవిడ శాంతం గౌరిని భయపెట్టింది. ఉన్నట్టుండి జుట్టుపట్టుకోదు కదా? గొడవ చేయదు కదా?

"రేపొస్తా! ఏ మాట చెప్పు!"

"రేపక్కరలేదు! రాత్రి పదిగంటలకు మీ అయ్యగారి పశువుల దొడ్డి దగ్గరికి వస్తానని చెప్పు!"

"పరాచికమా? ఆనక మా అయ్యా నన్ను చెప్పుచ్చుక కొట్టేపని చెయ్యకు!"

"నిజంగా వస్తాను వెళ్ళు!"

చెంబు తీసుకొని బయల్దేరబోతున్నది చంద్రావతి.

ఇంకా నిద్రపోని పుష్ప "చీకటిగా ఉంది లాంతరు తీసికెళ్ళరాదా?" అంది.

"వద్దు!"

"అక్కడంతా చీదరంగా ఉంటుంది. మొన్న నాగమ్మత్తకు పాము కనిపించిందట".

"ఇవాళ చాలా రోజులుగా పొంచి ఉన్న పాము చేతే కాటు వేయించుకోబోతున్నానే! ఇవాళ ఈ చంద్రావతి అనే మనిషి చచ్చి కేవలం తల్లిగా, తన పిల్లలకి తల్లిగా మాత్రం బతకబోతుంది!" స్వగతంగా అనుకొని, పైకి "వద్దులే" అంది.

చీకటిలో అడుగుపెట్టింది చంద్రావతి. నాలుగైదు అడుగులు వేసేదాకా చీకటి భయపెట్టినా ఆ తరువాత అది భయపెట్టడం మానేసింది. చీకటిలో చిరువెలుగు పరిసరాలను అస్పష్టంగా స్ఫూరింపజేయసాగింది.

ఊరవతల ఉన్న కాంతయ్య పశువుల దొడ్డికేసి గబగబా నడిచిపోసాగింది చంద్రావతి. ఒకరిద్దరు ఆడవాళ్ళు చెంబులతో తిరిగివస్తూ ఎదురుపడ్డారు.

కాంతయ్య పశువుల దొడ్డి దగ్గరికి వచ్చేసింది.

చీకటి!

కళ్ళు చించుకు చూడసాగింది చంద్రావతి. వెనుక దగ్గిన చప్పుడుకు వెనక్కి తిరిగింది.

"చంద్రావతి!" కొంచెం జీరగా వినిపించింది కాంతయ్య గొంతు.

"మీ జీతగాళ్ళు ఎవరూ లేరు కదా?"

"ఎవరూ లేరు." కాంతయ్య చెయ్యి చంద్రావతి రెక్కపట్టుకొంది. అతడి చెయ్యి నిప్పులా ఉంది. ఎటో తనని నడిపించుకు పోతున్న అతడి శ్వాస పాము బుసలా ఉంది.

జీతగాడు పడుకొనే నులకమంచం మీదికి చంద్రావతిని తోసి మీద పడ్డాడు కాంతయ్య. చిరకాల వాంఛితం తీర్చుకొని లేచి పంచకట్టుకొంటూ, "ఎల్లిగాడు వచ్చే వేళ అయింది త్వరగా వెళ్ళిపో" అన్నాడు.

చెంబులో నీళ్ళు కిందికి పారబోసి తిరుగు ముఖంపట్టింది చంద్రావతి. ఇవాళ కాంతయ్యతో చాలా మాట్లాడాలనుకొంది. కాని, ఒక్కటీ మాట్లాడనివ్వలేదతడు. 'పో నీలే చెప్పుకోడానికి గౌరి ఉందిలే' అని సరిపుచ్చుకొంది.

✧ ✧ ✧

కాంతయ్య నవ్వాడు. మళ్ళీ నవ్వాడు. విరగబడి నవ్వాడు.

"వరాలు బాగానే కోరిందే! పిల్లకు పెళ్ళి, పిల్లలకు చదువులు... గోపిని పట్నం తీసికెళ్ళి హాస్టల్లో ఉంచి చదివించాలంటనా? ఒకసారి పక్కలోకి రాగానే ఇవన్నీ జరిగిపోయేట్టయితే ఆడవాళ్ళందరూ ఇదే పని చేద్దురు. అయినా నా పక్కలోకి వచ్చే ప్రతీ ఆడదానికి ఇవన్నీ అమరుస్తూ పోతే ఈ ఆస్తి ఉండదు. ఈ ఊళ్ళో ఈ కాంతయ్యా ఉండడు... ఇదిగో గౌరీ! ఈ పది రూపాయలిచ్చి అయ్యగారు నెమ్మదిగా ఆ సంగతి గురించి ఆలోచిస్తామన్నారని చెప్పు! రాత్రికి దొడ్డి దగ్గరుంటానని చెప్పు!"

చంద్రావతితో పొందు కోరగానే లభించింది కాదు కాంతయ్యకు. తపించి తపించి ఒక విధమైన కసి లాంటిది ఏర్పడిన తరువాత దొరికిన పొందు. చంద్రావతిని పొందడంలో సుఖంకంటే, ఇన్నాల్టికి దాని పొగరణిగి తనకి లొంగిపోయింది కదా అన్న గర్వం అతడిని ఉన్మత్తుణ్ణి చేస్తోంది. చంద్రావతితో ఏర్పడిన శరీర సంబంధం అతడిలో ఏ అనుబంధానికీ అంకురార్పణ చేయలేదు. చంద్రావతి కష్టాలపట్ల అతడికి పిసరంత సానుభూతి కూడా లేదు.

ఒక మధ్యాహ్నం.

కాంతయ్య భోజనం చేసి చుట్ట కాల్చుకొంటున్నాడు.

గౌరి గాబరాగా పరిగెత్తుకు వచ్చి కాంతయ్య చెవిలో ఏదో ఊదింది.

అది పడుతున్న గాబరాలోపదోవంతుకూడా అతడు పడలేదు. "రేపు టౌన్‌కి వెడుతున్నాను. డాక్టరునడిగి మాత్రలు తెచ్చిస్తానని చెప్పు. అవునూ, ఎన్ని రోజులైందట?"

గౌరి చెప్పింది.

✧ ✧ ✧

"ఈ మధ్య బొత్తిగా బయటికి రావడమే మానేశావేమిటి, చంద్రావతీ?" అంటూ వచ్చింది నాగమ్మ.

"ఏదీ? ఆ మధ్య బావిలో కాలుజారి పడ్డప్పటినుండి మోకాలు ఇరుకుపట్టి వదలలేదు. పుష్పేనీళ్ళు తెస్తూంది. బయటికి వచ్చే పని ఉంటే కదా వచ్చేది?"

"అవునూ! నీ ముఖంలోకి కొత్త నిగనిగలొచ్చాయి! మనిషివి కూడా ఇదివరకటి కంటే కూడా కాస్త ఒళ్ళు చేసి కనబడుతున్నావు!"

నాగమ్మ అనుమాన దృక్కులతో తనని ఆపాదమస్తకమూ చూస్తూంటే సిగ్గుతో, భయంతో కుంచించుకు పోయింది చంద్రావతి.

"ఇదివరకటి అంత ఉపవాసాలు లేవు. మా తమ్ముడు పదీ పాతిక వాడి వెసలుబాటునుబట్టి పంపుతున్నాడు"

"అలాగా? ఇప్పటికైనా నీ పుట్టింటి వారికి నీ మీద దయ కలిగింది." నాగమ్మ కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడి వెళ్ళిపోయింది.

చంద్రావతి అద్దంలో ముఖం చూసుకుంది. ముఖం కొత్త కళతో నిగనిగలాడుతోంది. చీరకుచ్చిళ్ళు సవరించుకొని పొట్టకేసి చూచుకొంది. మూడో నెల కూడా దాటబోతూంది. దాగని పాపంలా కడుపు ముందుకు వచ్చేస్తోంది. ఇంకో రెండురోజులైతే ఈ పాపం బాంబులా పేలుతుంది ఊళ్ళో. ఊరివాళ్ళతో తనికి పని లేకపోవచ్చు. కాని, తన పిల్లల ముందు తను తల్లిగా నిలబడుతుందా? ఊరి వారందరికంటే ముందుగా తన పిల్లలే తనని అసహ్యించు కొంటారు.

టౌన్‌కి వెళ్ళినప్పుడల్లా కాంతయ్య డాక్టరుగారి నడిగి ఏవో మాత్రలు తెస్తున్నాడు. తను మింగుతూంది. కడుపు మాత్రం పోవడంలేదు. కాంతయ్యలాగే ఇదొక మొండిపిండమై తనని బజారు కీడ్చేట్టుంది!

ఇహ ఈ మాత్రల వల్ల లాభం లేదనుకొన్న చంద్రావతి గౌరి చేత ఎరుకల పుల్లికి కబురు చేసింది.

అది వచ్చి చూసి, "మూడోనెల కూడా దాటబోతూందంటివి! పని కష్టమౌతుందే!" అంది ముక్కు విరుస్తూ.

"నా ప్రాణంపోయినాసరే, ముందు మందుపోయవే!"

"పోస్తానుగాని నెలకి మూడు పదుల చొప్పున నూర్రూపాయల కట్నం ముందు పెట్టు."

చంద్రావతికి కళ్ళు బైర్లు కమ్మినట్టయ్యాయి. "నా దగ్గర అంత డబ్బెక్కడిదే? నీకు తెలియని సంసారమా? ఓ పాతికరూపాయలు తీసుకో. పని జరిపించు. వీలు చూచుకొని మరో పాతి ఇస్తానుగాని!"

"ఇలాంటి వాయిదాలు కుదరవు. ముందు నూర్రూపాయలు అక్కడ పెడితేగాని మందుపోయను. ఐనా, మంచి మిండడినే పట్టినావు కదా! నీకు డబ్బుకు కొదవేంటి? ఈ పాపం మూటగట్టించినవాడు దాన్ని వదలించుకోడానికి ఆ మాత్రం డబ్బియ్యడా?"

దాని బూతు మాటలకు ప్రాణంపోతే బాగుండుననిపించింది చంద్రావతికి.

అది చెప్పినట్టుగా కాంతయ్యదగ్గరికి గౌరిని పంపక తప్పలేదు చంద్రావతికి.

"ఈ మొగజాతికి మంటబెట్ట! అభమూ, శుభమూ తెలియనిదాన్ని రొంపిలోకి లాగి ఎట్లా మాట్లాడుతున్నాడో?... వాడి తల రెండు చెక్కలవనూ!" శాపనార్థాలు పెడుతూ తిరిగి వచ్చింది గౌరి.

"ఏమన్నాడే?" చంద్రావతి ముఖం వెలవెలబోయింది.

"ఏమంటాడు? ఉన్నది దులుపుకొని మాట్లాడే మాటలే మాట్లాడిండు. వాడి నోరు పడ!"

"ఇంతకీ ఏమన్నాడే?" చంద్రావతిలో ఆ కాస్త ఓపిక సన్నగిల్లి పోసాగింది.

"నువ్వే కొవ్వెక్కి ఆయనమీద పడ్డావట. ఈ కడుపులతో, ఖర్చులతో తనకేం సంబంధం లేదట. తను ఒక్క పైసా ఇచ్చేది లేదన్నాడు తల్లీ! నిజంగా ఈ పాపం నాది. ఆ డబ్బు నేనిస్తాను. మందు పోయించుకో ఎరుకల పుల్లితో."

ప్రాణం లేనట్టుగా పక్కమీద పడిపోయింది చంద్రావతి.

✧ ✧ ✧

బాధ అణుచుకోవాలని విశ్వప్రయత్నం చేసి విఫలమై పెద్ద పెద్ద కేకలే వేయసాగింది చంద్రావతి నొప్పితో మెలికలు తిరిగిపోతూ.

పుష్పతోసహా మిగతా పిల్లలు తల్లిని చుట్టుముట్టి కూర్చున్నారు బేలముఖాలు వేసుకొని.

"నంబితాతని పిలుచుకురానా?" అంది పుష్ప.

"వద్దు. ఎవరూ వద్దు. మీరు కూడా ఇక్కడినుండి వెళ్లండి."

మైలు దూరం వినిపించేట్టుగా ఉన్న చంద్రావతి కేకలకు ఇంటి నిండా జనం నిండిపోయారు. "ఎందుకొచ్చింది నొప్పి? నాభిగాని పెగలలేదు కదా? అయ్యో! మంచి వాళ్ళకే అన్ని కష్టాలూ పెడతాడు కదమ్మా దేవుడు.

"చీరంతా రక్తం! ఏమిటది? ముట్టునొప్పిలా ఉంది."

"ముట్టుకాదు!... కుండతో గుమ్మరించినట్టుగా రక్తం మడుగు కడుతుందా?" గుసగుసలు పోయారు.

చంద్రావతి వాళ్ళ మాటలు వినలేక లోపలి గదిలోకి పారిపోయి తలుపులు మూసేసుకొంది. నొప్పి నరాలని పీకేస్తూంటే దెబ్బతిన్న పాములా మెలికలు తిరుగుతూ ఉండగట్టుకుపోయి నేల మీద దొర్లసాగింది.

"కొంచెం తలుపు తెరవమ్మా! ఎరుకలదాన్ని తీసుకు వచ్చాను" గౌరి పిలిచింది. ఎలాగో శక్తికూడ దీసుకొని లేచి తలుపు గడియ తీసింది చంద్రావతి.

పుల్లి చంద్రావతి నాలుక చూసింది. నాలికమీద ముళ్ళు మొలిచాయి!

"గంట నుండి దాహం చంపేస్తోంది. ఒక చుక్క నీళ్ళు నాలిక మీద వదలండే!"

"నీళ్ళు తాగుతావా? విషంతో సమానంగా పని చేస్తాయి నీళ్ళిప్పుడు!"

"ఈ బాధ, ఈ దాహం..." చంద్రావతికి స్పృహతప్పి పోయే సమయానికి, "నా చేతులు దాటి పోయింది. టౌన్‌కి తీసికెళ్ళి డాక్టరుకి చూపించుకోవాల్సిందే" అంటూ పుల్లి వెళ్ళిపోయింది.

జనం కూడా వెళ్ళిపోయారు. లోకంలో పాపం పెరిగిపోతున్నదని వాపోతూ.

తప్పుచేసిన తల్లి ముఖం చూడడానికి మనస్కరించక పిల్లలు గది ఇవతలే ఉండిపోయారు.

గౌరి దిక్కుతోచనట్టుగా చంద్రావతి పక్కన కూలబడిపోయింది.

✧ ✧ ✧

గౌరి మెల్లగా ఇంట్లో అడుగుపెట్టి, "ఇంట్లో ఎవరూ లేరేమిటమ్మా?" అంది.

"లేరు."

"ఎక్కడికి ఎల్లినారు?"

"ఇక్కడ ఉంటే నా పాపపు సొమ్ము తినాల్సి వస్తుందట. కులట పిల్లలుగా బతకడం కంటే వాళ్ళ అమ్మమ్మ ఊరు వెళ్ళిపోయి కాయకష్టం చేసుకు బతుకుతామని తమ్ముళ్ళని తీసుకొని వెళ్ళిపోయింది పుష్ప.

ఈ రోజు పుష్ప అన్నమాటలు చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి చంద్రావతికి "ఊరంతటికీ శకునాలు చెప్పే బల్లి చివరికి కుడితి తొట్టెలో పడి చచ్చినట్టు... నువ్వు నా చేత ఒట్టేయించుకొని, నువ్వు చేసిన పనేమిటమ్మా? నువ్వు మా కోసమే ఈ పాపపు పని చేశావా?... ఇలాంటి తల్లి ఉన్నందుకు లోలోపల మేం గర్వపడినా బయట సిగ్గుతో తలవంచుకోవాలి కదమ్మా? కులట పిల్లలుగా బతకడం కంటే కాయ కష్టం చేసుకు బతకడం గౌరవంగా కనిపిస్తుంది! తండ్రి ఎప్పుడో చచ్చాడు మాకు. నువ్వు తప్పు, చేశావని తెలిసినరోజు తల్లి కూడా చచ్చిందనుకొన్నాం..."

ఎవరికోసం నిప్పులాంటి శీలాన్ని బొగ్గుగా మార్చుకొందో – ఎవరికోసం ఈ చంద్రావతి ఒక విధంగా చచ్చి ఒకవిధంగా బతకాలనుకొందో... వాళ్ళు... తన పిల్లలు తనని అసహ్యించుకొని వెళ్ళిపోయారు.

చంద్రావతి గుండెలో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి.

ఏ పిల్లల భవిష్యత్తుకోసం తనని కాంతయ్యకి బలిచేసుకొందో ఆ పిల్లలకి తనేమీ చేయలేకపోయింది! పైగా కులట పిల్లలుగా పిలువబడే పరిస్థితి కల్పించింది. ఈ ప్రపంచంలో ఏ తల్లీ తన పిల్లలకి చేయగూడని ద్రోహం చేసింది.

"రాత్రికి అయ్యగారు దొడ్డికాడికి రమ్మన్నారు."

చంద్రావతి – 'ఇంకేంపని? ఇంకానా?' అంటుందన్న ఊహ తల కిందులు కాగా – "ఎల్తావా?" అంది ఆశ్చర్యంగా గౌరి.

"వెళ్ళకపోతే ఇప్పుడు పతివ్రతను కాదుగా? కాటు ఎప్పుడో వేశాడు. తను వేయలేదు. నేనే వేయించుకొన్నాను. కాని, అది ఎన్నాళ్ళుగానో పగబట్టి వేసిన కాటు అని మాత్రం అప్పుడు గుర్తించలేకపోయాను. కాటుతిన్న మనిషి చస్తాడు. కాటువేసిన పామూ చస్తుందట. చావకపోతే చంపాలి! మళ్ళీ అది మరొకరిని కాటువేయకుండా."

చంద్రావతి కళ్ళు కసితో మెరుస్తున్నాయి.

"నీ మాటలు నాకు సరిగా అర్థం కావడంలేదు. కాని, నీకు ఒకటి చెప్పదలుచుకొన్నాను. ఎర్రిమాలోకంలా ఊరికే చెయ్యి ఇచ్చి కూర్చోకు. మగాడి జుట్టు నీ చేతిలో ఉంచుకోవాలిగాని నీ జుట్టు అతడి చేతిలో ఉంచకూడదు. గడుసుదనం నేర్చుకో. నీ పిల్లలు ఇవాళ పౌరుషంతో అలిగిపోయినా రేపు కడుపుకాలితే ఆళ్ళే తిరిగి వస్తారు. వాళ్ళకి ఒకదారి ఏర్పరచాలంటే నువ్వు కొంచెం తెలివిగా వ్యవహరించాలి. అందాల బొమ్మవు. ఈ కాంతయ్య కాకపోతే మరోడు. ఒకసారి చెడ్డావు. ఇంకా చెడేదేముంది?" గౌరి హితవు చెప్పింది. "జాగ్రత్త. మళ్ళీ నెల తప్పేపని చేసుకోకు. మొన్నే చచ్చి బతికావు" అంది వెడుతూ.

✧ ✧ ✧

నలుగురున్న ఇంటిలో పెళ్ళాంతో ఏకాంతం దొరకడానికి ఆలస్యమైన ఎల్లిగాడు కాంతయ్యగారి పశువుల దగ్గరికి వచ్చేసరికి పన్నెండు అయింది.

పశువులముందు గడ్డివేసి తను పడుకొనే మంచందగ్గరికి వచ్చాడు ఎల్లిగాడు. మసకవెలుగులో మంచం మీద ఎవరో పడుకొని ఉండడం చూసి, "ఎవరదీ?" అన్నాడు.

జవాబు రాకపోయేసరికి ఎద్దుల మిద్దెలో ఇనుపచువ్వకు వేలాడుతున్న లాంతరు తీసుకువచ్చి చూశాడు.

కాంతయ్య చచ్చిపడి ఉన్నాడు.

గుండెలో కత్తిపోట్లు. రక్తం మంచంకింద మడుగు కట్టేసింది.

"అయ్యబాబోయ్! అయ్యగారిని ఎవరో చంపేశారు." ఎల్లిగాడు బాణంలా ఊళ్ళోకి దూసుకుపోయాడు.

కాంతయ్య హత్య గురించిన వార్త రాత్రికి రాత్రే కార్చిచ్చులా వ్యాపించి పోయింది.

ఎవరు చంపారన్న ప్రశ్నకు జవాబుగా మరునాడు చంద్రావతి శవం చెరువులో తేలింది!

*ఆంధ్రభూమి వారపత్రిక, 18 జనవరి 1979*

◆